సాక్షి శ్రీకాకుళం

శనివారం । 14 । డిసెంబర్ । 2024



దొంగనోట్ల ముఠా ఆటకట్టు

దొంగనోట్ల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు.

- 8లో



ఉత్సాహంగా ఎంపికలు

బాక్సింగ్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారులు ప్రతిభ చూపించారు.

- 8లో



భారీ ర్యాలీగా వెళ్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్లకార్డుతో ర్యాలీగా వస్తున్న రైతు

రైతన్న గుండెకు గొంతుక

రైతన్న గుండె ఘోషకు వైఎస్సార్ సీపీ గొంతుకనిచ్చింది. అన్నదాత ఆవేదనను నినాదాల రూపంలో ప్రతిధ్వనింపజేసింది. సాయం అందక నిస్సహాయుడైపోయిన కర్షకుడి ఆగ్రహానికి ఓ వేదికను ఇచ్చింది. మాటలు తప్ప చేతలు లేని సర్కారు తీరుకు నిరసనగా రైతు ర్యాలీని నిర్వహించింది. ఉభాల నుంచి విక్రయాల వరకు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా.. కనికరించని సర్కారు వైఖరిని జనం సాక్షిగా దునుమాడింది. జనం పక్షాన నిలుస్తూ పోరుబాటను మొదలుపెట్టింది.

- కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ ధ్వజం
- ప్రభుత్వ తీరుకు నిరసనగా జిల్లా కేంద్రంలో రైతు ర్యాలీ
- వేలాదిగా తరలివచ్చిన అన్నదాతలు
- ఇప్పుడు అప్పులు గుర్తుకు వచ్చాయా: మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్
- చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు: మాజీ మంత్రి సీదిరి
- రైతులకిచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని జేసీకి వినతి పత్రం అందజేత



పోరాటమే అజెండా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/ శ్రీకాకుళం పాతబస్టాండ్‌:

కూటమి ప్రభుత్వం అన్నదాతకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ ధ్వజమెత్తింది. కోతలు కూడా అయిపోతున్నా అన్నదాత సుఖీభవ కింద సాయం అందజేయకపోవడంపై మండిపడింది. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకు అన్ని దశల్లోనూ అండగా నిలిచామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వరకు ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందించారు. ముందుగా పొన్నాడ వంతెన వద్ద మహాత్మా జ్యోతీరావు పూలే పార్కు వద్దకు పార్టీ శ్రేణులు భారీగా చేరుకున్నాయి. అక్కడి నుంచి ర్యాలీగా ఎడ్లబళ్లపై వెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలంతా కలిసి జేసీకి వినతి పత్రం అందించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, టెక్కలి, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, తూర్పుకాపు, కాళింగకుల, కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, అంధవరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ సత్యన్నారాయణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, పొన్నాడ రుషి, ఎన్ని ధనుంజయరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, సాధు వైకుంఠరావు, కరి మి రాజేశ్వరరావు, ధర్మాన రామలింగంనాయుడు, గొండు కృష్ణ, గొండు రఘురాం, గేదెల పురుషోత్తం, అంబటి శ్రీనివాసరావు, చింతాడ వరుణ్, సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, కడియాల ప్రకాష్, చిట్టి జనార్ధనరావు, ఖండాపు గోవిందరావు, అంధవరపు రమేష్, అల్లు లక్ష్మీనారాయణ, పీస గోపి, టి.కామేశ్వరి, మూకళ్ల తాతబాబు, వైవీ దివ్యశ్రీధర్, యజ్జల గురుమూర్తి, మార్పు పృథ్వీ, పిన్నింటి సాయి, రొక్కం బాలకృష్ణ, సనపల నారాయణరావు, దన్నా రామినాయుడు, పైడి శ్రీనివాసరావు, బూర్లె శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పప్పల రమేష్, కోట గోవిందరావు, ఎంఏ బేగ్, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, మండవల్లి రవి, ఖైరి మురళి, కర్నేన హరి, సీపాన రామారావు, బోర బుజ్జి, శ్రీరామ్మూర్తి, జోగారావు, జె.జయరాం, రాజాపు అప్పన్న, తులసీదాస్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎడ్ల బండిపై కలెక్టరేట్‌కు వెళ్తున్న ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్, కె.వి.సత్యనారాయణ, తిలక్ తదితరులు



ప్లకార్డులతో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి (చిత్రంలో) జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంవీ పద్మావతి

కూటమిది పచ్చి మోసం

అన్నదాతలకు రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి మోసం చేశారు. సూపర్ సిక్స్‌పేరిట వాగ్దానాలు ఇచ్చి మర్చిపోయారు. వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లా అయినా రైతులకు చిన్న సాయం కూడా చేయలేకపోయారు. చెరకు రైతులకు సైతం పెట్టుబడులు పెరిగాయి, కూలీ చార్జీలు పెరిగాయి కాబట్టి చెరకుకి మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి. ధాన్యం కొనుగోలులోనూ రకరకాల కొర్రీలు పెడుతున్నారు. దళారులు రైతులను దోచుకుంటున్నా చర్యలు తీసుకోవడం లేదు. పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించి అన్ని రకాలుగా ప్రభుత్వమే సాయం అందించాలి. ప్రజలకు పథకాలు అందించాల్సి వచ్చినప్పుడే ప్రభుత్వానికి అప్పులు గుర్తుకువస్తాయా. ముందు తెలీదా..?

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబుది వంచన..



మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా కింద రూ.13,500 ఠంచనుగా సాయం అందించే వాళ్లం. ఆ సాయాన్ని రూ.20వేలు చేస్తానని చెప్పి చంద్రబాబు వంచన చేశారు. ప్రజలే ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారు. 2019కి ముందు పంటల బీమాను రైతుల చేత కట్టించే వారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచిత పంటల బీమా ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే కట్టి ఆదుకుంది. రైతును మోసం చేశారు కాబట్టే మేం రోడ్డెక్కాం. అబద్ధపు హామీలు ఇచ్చిన చంద్రబాబుకు ఇప్పుడు అప్పులు గుర్తుకువచ్చాయా. అప్పుల విషయంలోనూ ఇలాగే దుష్ప్రచారం చేశారు. ఆరు నెలల్లోనే ధరలతో బాదేస్తున్నారు. గ్యాస్ డబ్బులు పడకపోతే ఎవరిని అడగాలో కూడా ప్రజలకు తెలీడం లేదు. రాష్ట్రంలో సాక్షి, ఇతర జర్నలిస్టులపై దాడులు హేయం. రాష్ట్రం అప్రకటిత ఎమర్జెన్సీలో ఉందా..? ప్రభుత్వాలు నడిపే వారు ప్రజల కోసం పనిచేయాలి తప్ప కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవడానికి కాదు. ఎన్నికల ముందు సూక్తులు చెప్పి.. ఇప్పుడు కబుర్లు చెప్పడం చంద్రబాబుకు సరికాదు. గ్రామాల్లోకి వెళ్లి చూస్తే ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయి. మెడికల్ కాలేజీలు, పోర్టులు ప్రైవేటుపరం చేసేస్తున్నారు.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

రైతు పోరు విజయవంతం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన రైతు ర్యాలీ విజయవంతమైందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారని, వీరందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డిసెంబర్ నెలాఖరున విద్యుత్ చార్జీలపైన, జనవరిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైన ర్యాలీలు ఉంటాయని, వీటికి కూడా పార్టీ శ్రేణులు బాధితులు హాజరుకావాలని కోరారు.



జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం అందిస్తున్న పార్టీ నాయకులు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

అక్షరంపై దాడి సిగ్గు చేటు

శ్రీకాకుళం పాతబస్టాండ్/ శ్రీకాకుళం పీఎన్‌కాలనీ:

అక్షరంపై దాడులు సిగ్గు చేటని పాత్రికేయులు ధ్వజమెత్తారు. తాజాగా చిత్తూరు జిల్లా తిరుపతి, కడప జిల్లాల్లో కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై మూకుమ్మడిగా దాడిచేసి గాయాలపాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు చేయాలే తప్ప ప్రశ్నించేవారిపై కూటమి ప్రభుత్వ పైశాచికత్వంగా వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వినతి పత్రం ఇచ్చినవారిలో పాత్రికేయులు టి.సునీల్, బగాది అప్పలనాయుడు, వి.సన్యాసినాయుడు, వి.సత్యానాయుడు, సీహెచ్ శ్రీను, ఎ.రామకృష్ణ, కెమెరామెన్ రాజు, కె.జయశంకర్, పైడి బాలకృష్ణ, మొదలవలస వాసు, రాజేష్, సూరిబాబు, కె.శంకర్, సింగ్, సీహెచ్ రాము, హరికృష్ణ, నిరంజన్, నాయుడు, సంతోష్‌లతో పాటు అధిక సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జేసీకి వినతి పత్రం అందిస్తున్న శ్రీకాకుళం జర్నలిస్టులు

చర్యలు తీసుకోవాలి

టెక్కలి: సాక్షి మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం టెక్కలి ప్రెస్‌క్లబ్ సభ్యులంతా ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను కవరేజ్ చేసేందుకు వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులు శ్రీనివాస్, రాజారెడ్డి, కెమెరామెన్ రాములపై కొంత మంది టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో టెక్కలి ప్రెస్‌క్లబ్ సభ్యులు ఎల్.వెంకటరమణ, డి.భాస్కర్, డి.భాను, కె.రామారావు, టి.తిరుపతిరావు, ఎస్.ప్రవీణ్, జి.రాంబాబు, టి.ప్రసాద్ రెడ్డి, పి.అభి, డి.గౌరీశంకర్‌రెడ్డి, బి.ఈశ్వర్, ఎస్.బాబ్జి, డి.సుధాకర్, హరినాథ్‌రెడ్డి, జె.హరి, రాంబాబు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న టెక్కలి ప్రెస్‌క్లబ్ సభ్యులు

దాడిని ఖండించిన స్వామ్నా

శ్రీకాకుళం: రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని చిన్న, మధ్యతరహా వార్తా పత్రికల సంఘం (స్వామ్నా) ఆందోళన వ్యక్తం చేసింది. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో సాక్షి మీడియా బృందంపై జరిగిన దాడిని ఖండిస్తూ, ఇలాంటి విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, సీహెచ్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.

16న జాబ్‌మేళా

నరసన్నపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లత, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. 19 ఏళ్ల నుంచి 28 ఏళ్ల లోపు నిరుద్యోగ యువత (పురుషులు) కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం 9 గంటలకు కళాశాల ప్రాంగణానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరుకోవాలని సూచించారు. ఉద్యోగ మేళాలో హెటిరో, భారత ఫైనాన్సియల్ లిమిటెడ్, విరాట్ మోడీ సోలార్ సిటీ కంపెనీ ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్ నుంచి బీటెక్, డిప్లమా వంటి విద్యార్హతలు కలిగిన యువత పాల్గొనవచ్చని తెలిపారు.

16న ఎస్సీ ఉప వర్గీకరణ కమిషన్ పర్యటన

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఐఏఎస్ (రిటైర్డ్) ఈనెల 16న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కమిషన్ చైర్మన్ 16న ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని, 11 గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమవుతారు. తర్వాత దళిత కులాలకు చెందిన ఉద్యోగులు, కులసంఘ నాయకులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నేడే జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జాతీయ లోక్ అదాలత్ శనివారం జరగనుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 19 బెంచీలు నిర్వహించామని, దీన్ని జిల్లాలో గల ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే లీగల్ సర్వీసులను ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్ వారిని, పారా లీగల్ వలంటీర్స్‌ను నియమించి వారికి బ్యాడ్జెస్ ఇచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ధ్రువతార రాకకై..



ధ్రువతార రాక కోసం ఆరాధనా మందిరాలు సిద్ధమవుతున్నాయి. క్రీస్తు పుట్టిన రోజులు వేడుకలు నిర్వహించేందుకు చర్చిలు అందంగా ముస్తాబుతున్నాయి. శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద ఉన్న సెయింట్ జాన్స్ చర్చి ఇలా విద్యుద్ దీపాలతో మెరిసిపోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

తమ్మినాయుడుపేట ఇసుక రీచ్‌పై నిఘా

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి కార్యాలయాన్ని తరచూ ఫిర్యాదులు వెళ్తున్న తమ్మినాయుడుపేట ఇసుక రీచ్‌పై రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇసుక తరలిస్తున్న పది ట్రాక్టర్లు గురువారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైన్స్ విభాగానికి అప్పగించేలా కేసు నమోదు చేయాలని పోలీసులకు తహసీల్దార్ ఎ.సింహాచలం లేఖ అందజేశారు. ఈ మేరకు పోలీసులు మైన్స్‌కు అప్పగించనున్నారు. మరోవైపు స్థానిక రిజిస్ట్రేషన్లపై 70 ట్రాక్టర్లు ఉన్నట్లు సమాచారం. ఈ అంశంపై సైతం అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఉచితం ముసుగులో పోగులు వేయటం, రాత్రి వేళ విశాఖపట్నం తరలించటం వంటి ఘటనలపై ఆరాతీస్తున్నారు.

బొల్లినేనిలో మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ మహీంద్రా ఫౌండేషన్, అమెజాన్ సంస్థలు తమ వెబ్ సెర్వీసెస్ రీసార్ట్ ప్రోగ్రాంలో భాగంగా డిగ్రీ(కంప్యూటర్) విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2022, 23, 24 సంవత్సరాల్లో ఇంజనీరింగ్,(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ కంప్యూటర్స్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందని, పూర్తి వివరాలకు 76809 45357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్–జూనియర్స్ ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆర్చరీ సంఘ జిల్లా కార్యదర్శి ఎల్.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అరసవల్లి రోడ్డులోని ఆదిత్య ఆర్చరీ అకాడమీలో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. ఎంపికైనవారిని ఈ నెల 23 నుంచి 25 వరకు రాజమండ్రి వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ ఆర్చరీ చాంపియన్‌షిప్–2024 పోటీలకు పంపిస్తామని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 3 పాస్‌ఫొటోలు, ఎంట్రీ ఫీజుతో ఎంపికలకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు 94406 77201, 99899 78727 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఏపీ తూర్పుకాపు సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడి



గుమ్మడి శాంతారావుకు నియామక పత్రం అందిస్తున్న చంద్రమోహన్

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ సంఘం యువజన విభాగం శ్రీకాకుళం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడి శాంతారావును నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ తూర్పుకాపు జాతి అభ్యున్నతికి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. సంఘ పెద్దల సూచనల మేరకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటానని తెలిపారు.

రైలు కిందపడి మహిళ మృతి

పొందూరు: పొందూరు–దూసి రైల్వేస్టేషన్ల మధ్య పెనుబర్తి సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతురాలి వయసు 60 ఏళ్లు ఉండవచ్చని, ఎర్రని చీరను ధరించి ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 94907 27521 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

18.50 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనం

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పీడీ ప్రసాద్ తెలిజేశారు. గురువారం ఒడిశా నుంచి చందన్‌కుమార్‌మహంతి అనే యువకుడు 18.50 కిలోల గంజాయిని ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై తీసుకొస్తుండగా పురుషోత్తపురం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. ఇందులో ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా ఆటకట్టు

- రూ.75.25 లక్షల దొంగనోట్ల స్వాధీనం
- ఆరుగురు వ్యక్తుల అరెస్ట్
- పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాల వారే నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న టెక్కలి డీఎస్పీ మూర్తి

మెళియాపుట్టి : దొంగనోట్లు ముద్రించి అడ్డదారిలో డబ్బు సంపాదించాలనుకున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. టెక్కలి డీఎస్పీ ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి వివరాలను శుక్రవారం స్థానిక స్టేషన్ వద్ద వెల్లడించారు. తక్కువ సొమ్ముకు అధిక మొత్తంలో దొంగనోట్లు ఇస్తామని ఆశ చూపించే ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. పలాస మండలం నర్సింపురం గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి రవి, పెదంచల గ్రామానికి చెందిన కుసిరెడ్డి దూర్వాసులు, మెళియపుట్టి మండలం సంతలక్ష్మీపురానికి చెందిన తమ్మిరెడ్డి ఢిల్లీరావు, దాసరి కుమారస్వామి, కరజాడ గ్రామానికి చెందిన దాసరి రవికుమార్, వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు గ్రామానికి చెందిన దుమ్ము ధర్మారావులను అరెస్టు చేశామని, వీరి వద్ద నుంచి కెనాన్ కలర్ ప్రింటింగ్ మిషన్, కలర్ ఇంక్ బాటిల్స్, బ్లేడ్, గమ్ బాటిల్, పేపర్ కట్టలు, రూ.57.25 లక్షలు విలువైన దొంగనోట్లు, 4 సెల్ ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం (స్కూటీ) స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎలా పట్టుకున్నారంటే..?

కేసులో ఎ1 గా ఉన్న తమ్మిరెడ్డి రవి అనే వ్యక్తి గురువారం మెళియాపుట్టి మండలం పట్టుపురం కూడలిలో కొంతమేర దొంగనోట్లు పట్టుకుని తిరుగుతున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ రమేష్ బాబు సిబ్బందితో వెళ్లి అతడిని పట్టుకుని దొంగ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిని స్టేషన్‌కు తరలించి విచారణ చేయగా మిగిలిన వారి పేర్లు చెప్పాడు. దీంతో వారందరినీ అరెస్టు చేశారు. వారి వద్దనున్న మొత్తం నకిలీ నోట్లు అయిన రూ.27.25 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

నేరం చేయడంలో వీరి స్టైలే వేరు

వీరంతా ఒక్కో ప్రాంతాలకు చెందిన వ్యక్తులు. ఒడిశాలో ఎక్కడి నుంచో కొన్ని దొంగనోట్లు సంపాదించి, నకిలీనోట్లు తయారు చేసే విధానాన్ని యూట్యూబ్‌లో చూసేవారు. సంతలక్ష్మీ పురం గ్రామంలోని అందరూ నివాసముండే ప్రదేశంలోనే ఇళ్ల మధ్య ఒక ఇంటిని ఎంచుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రింటర్, ఇతర సామగ్రి అక్కడ ఏర్పాటు చేసుకున్నారు. ఇక వ్యాపారం మొదలెట్టే ప్రక్రియలో భాగంగా రూ.5లక్షలు ఇస్తే రూ.25 లక్షల నకిలీ నోట్లు ఇవ్వడానికి ఓ వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకుని నోట్ల తయారీ ప్రారంభించారు. అందులో భాగంగానే మచ్చుకు కొన్ని నోట్లు చూపించే క్రమంలోనే పట్టుబడ్డారు.

ఇద్దరు పాత నేరస్తులే..

నేరానికి పాల్పడిన వారిలో ఎ2 గా ఉన్న కుసిరెడ్డి దూర్వాసులుపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో మర్డర్ కేసు, ఎ6 దుమ్ము ధర్మారావు పై పలాస, మందస పోలీస్ స్టేషన్లలో పలు మార్లు దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయి. మరికొందరిపై ఇతర జిల్లాల్లోనూ కేసులు ఉన్నాయి. అయితే నకిలీ నోట్ల కేసులో మరికొందరు ముద్దాయిలను పట్టుకోవాల్సి ఉందని, వారిని త్వరలోనే పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లలో 500,200 నోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతానికి దొంగ నోట్లు చేతులు మారలేదని, దర్యాప్తు ముమ్మరం చేస్తున్నామన్నారు. ముద్దాయిలను టెక్కలి కోర్టులో హాజరుపరిచారు. పాతపట్నం సీఐ రామారావు, మెళియాపుట్టి ఎస్సై రమేష్ బాబు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న దొంగనోట్లు, సెల్‌ఫోన్లు, ప్రింటర్ ఇతరములు



గురువారం పట్టుబడిన నిందితులతో సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐలు

రూ. 15 లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం

శ్రీకాకుళం క్రైమ్ : జి.సిగడాం మండలం పెనసాం గ్రామ కూడలి వద్ద నకిలీ నోట్లు ద్విచక్రవాహనంపై తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.15 లక్షల (30 కట్టలు) నకిలీ కరెన్సీతో పాటు రూ.1.50 లక్షల బ్లాక్ కరెన్సీ.. అంటే నల్లపూత ఉన్న నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. జేఆర్ పురం సీఐ అవతారం ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే..

ఎచ్చెర్ల మండలం కొత్తదిబ్బలపాలెం గ్రామానికి చెందిన గనగళ్ల రవి (39) డిగ్రీ చదివి 2014లో ఓ ప్రైవేటు స్కూలు స్థాపించాడు. అందులో తీవ్ర నష్టాలు రావడంతో ఓ సూపర్‌మార్కెట్ పెట్టాడు. అది కూడా నష్టాలను మిగిల్చింది. అదే మండలం యాతపేటకు చెందిన ఓ సాయంకాల దిన పత్రిక ఎండీ ఎన్ని రాజేష్ (29)తో ఎప్పటి నుంచో పరిచయాలున్నాయి. ఇద్దరూ తక్కువ కాలంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో పర్లాఖిముండి, గుణుపూర్ వంటి ఒడిశా ప్రాంతాలు తిరిగి దొంగనోట్లు తయారు చేసే విధానం, రైస్ పుల్లింగ్ బిజినెస్ గురించి తెలుసుకున్నారు. అదే ప్రాంతాల నుంచి కొన్ని దొంగనోట్లు మన ప్రాంతాలకు టెస్టింగ్ కోసం తెచ్చి పబ్లిక్‌లో విజయవంతంగా చెలామణీ చేయడంతో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు.

రాజమండ్రి, భీమవరం వ్యాపారులతో కలిసి..

ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాపరెడ్డి, భీమవరానికి చెందిన కృష్ణమూర్తిలతో పరిచయమయ్యారు. దానికి వారు 1:3 నిష్పత్తిలో నోట్లు ఇస్తామని చెప్పడంతో ఇద్దరూ ఓకే అయ్యారు. అప్పటికే రూ.20 లక్షల పెట్టుబడితో సిద్ధంగా ఉన్న రవి, రాజేష్‌లు ప్రతాపరెడ్డికి రూ.5.18 లక్షలు ఇచ్చి నల్లపూత వేసిన నకిలీ కరెన్సీ రూ.60 లక్షలు తీసుకొని వచ్చేశారు. ఇద్దరూ అక్కడి నుంచి భద్రాచలం వెళ్లి అక్కడ నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించే రసాయనాలు కొని తీసుకొచ్చేశారు.

ఎలా పట్టుబడ్డారంటే...

ఇద్దరూ తర్వాత కృష్ణమూర్తికి రూ.5 లక్షల ఒరిజినల్ అమౌంట్ ఇవ్వగా రూ.15 లక్షలు దొంగనోట్లు ఆయన ఇవ్వడంతో రాజాంపై నుంచి సాలూరు, ఒడిశా చుట్టు పక్కల ప్రాంతాల్లో నోట్లను చెలామణీ చేసేందుకు ప్రణాళిక వేసుకున్నారు. అప్పటికే జి.సిగడాం ఎస్‌ఐకు సమాచారం ఉండటం, అప్పటికే జేఆర్ పురం సీఐ అవతారం మాటు వేసి ఉండడంతో రాజేష్, రవిలు ద్విచక్రవాహనంపై వెళ్తూ పెనసాం గ్రామం వద్ద పట్టుబడ్డారు. వెంటనే వీరిని అరెస్టు చేసి శుక్రవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన నిందితుల నుంచి కరెన్సీతో పాటు బజాజ్ పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, ఓ బ్యాగు స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ నోట్ల వ్యవహారంలో పాత్ర ఉన్న ప్రతాపరెడ్డి, కృష్ణమూర్తి, మిగతా వ్యక్తులను అరెస్టు చేయాల్సి ఉందని సీఐ వివరించారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద సమక్షంలో కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ అవతారం, ఎస్‌ఐలను ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అభినందించారు.

ఉత్సాహంగా జిల్లా బాక్సింగ్ ఎంపికలు



బాక్సింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు, పక్కనే కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికలను తొలుత డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 48 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో బాక్సింగ్ క్రీడకు విశ్వవ్యాప్తంగా ఆదరణ, గుర్తింపు ఉందన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు, కోచ్‌లకు గౌరవాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు.

19, 20 తేదీల్లో రాష్ట్ర పోటీలు..

ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను పిఠాపురంలో ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బలగ అనంత లక్ష్మణ్‌దేవ్ (అను) పేర్కొన్నారు. గత ఏడాది స్టేట్‌మీట్‌లో శ్రీకాకుళం జిల్లా చాంపియన్‌షిప్‌ను కై వశం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తు.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులనే రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. అనంతరం ఎంపికైన క్రీడాకారుల జాబితాను వెల్లడించారు. వీరికి భీమేశ్వర బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు బలగ సీతారాం అభినందనలు తెలిపి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు, సీనియర్ బాక్సర్లు జి.రాజీవ్, బి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

రాష్ట్రస్థాయి పోటీలకు సీహెచ్ జ్ఞానేశ్వరరావు (55 కేజీలు), పి.అప్పలరాజు (60 కేజీలు), పి.జాను (65 కేజీలు), ఎం.లోకేష్ (70 కేజీలు), ఎస్.ఏసు (75 కేజీలు), కె.శ్రీకాంత్ (80 కేజీలు), ఎల్.అభిరామ్ (85 కేజీలు), డి.మోజ్‌కుమార్ (90 కేజీలు), ఆర్.హేమంత్‌కుమార్ (90+కేజీలు) బరువు కేటగిరీల్లో ఎంపికయ్యారు.

కబేళాలకు పశువుల తరలింపు

- ఐదుగురిపై కేసు నమోదు

ఆమదాలవలస: కొత్తూరు మండలం బలద గ్రామం నుంచి ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ సంతకు 34 పశువులను తోడ్కొని రావడాన్ని గమనించిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. పార్వతీశ్వరునిపేట సమీపంలో పశువులను అడ్డుకొని వాటిని తీసుకుకొస్తున్న వారిని విచారించారు. కబేళాలకు తరలిస్తున్నట్లు గుర్తించి త్రినాథ్, శంకర్, శేఖర్‌లతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పశువులను స్వాధీనం చేసుకొని కొత్తవలస గోశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు సాధు కిరణ్, చింతాడ అప్పారావు, బజరంగ్‌దళ్ ఈశ్వర్, హిందూపరిషత్ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పశుసంవర్థకశాఖ ఏడీ రోణంకి ఆనందరావు పశువుల రక్షణకు చర్యలు చేపట్టారు.



అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న పశువులు

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్లను తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం డిమాండ్ చేశారు. గతంలో ఉన్న మూడు మస్టర్ పాయింట్ల స్థానంలో ఐదు పాయింట్లుగా పెంచడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నిర్ణయంను వెనక్కి తీసుకోవాలని అధికారులను కోరినా పట్టించుకోకపోవడం తగదన్నారు. దీనిని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి కార్మికులు విధులు బహిష్కరించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకుని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కు సమస్య వివరించారు. అయినా పట్టించుకోకపోవడంతో ఏపీ మున్సిపల్ వర్కర్స్ –ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా రెండు మస్టర్ పాయింట్లు కలపడంతో వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందన్నారు. సరైన పనిముట్లు పూర్తిగా ఇవ్వకుండా పని చేయాలని వేధింపులు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. క్లాప్ వెహికల్స్ ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తల ఒక్కో ఇంటి నుంచి కేజీకి తక్కువ కాకుండా కార్మికులు తీసుకొని రావాలని, లేకపోతే ఆబ్సెంట్ వేస్తామని బెదిరించడం సరికాదన్నారు. ఇప్పటికై నా అధికారులు తమ వైఖరి మార్చుకొని కార్మికుల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ – ఎంప్లాయిస్ ఫెడరేషన్ శ్రీకాకుళం నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, ఆకుల శంకరరావు, డి.చిట్టి, ఎ.రాము, డి.యుగంధర్, ఏ.శేఖర్, ఏ.జనార్దన్, ఎ.గురుస్వామి, జె.మాధవి, ఎ.రాజేశ్వరి, పార్వతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మృతదేహం అప్పగింత

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్‌కు చెందిన సివిల్ ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థి రమావత్ ప్రవీణ్‌నాయక్ బుధవారం అర్ధ రాత్రి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. తల్లితండ్రులు రవీంద్రనాయక్, విజయాబాయి, బంధువులు ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నుంచి గురువారం రాత్రి శ్రీకాకుళం చేరుకున్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీలో తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం రిమ్స్‌లో శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పరిశీలించిన పోలీసులు, అధికారులు..

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి క్యాంపస్ పరిసరాలను పరిశీలించారు. సున్నిత మనస్కుడైన ఈ విద్యార్థి ప్రేమించిన అమ్మాయి ప్రేమను తిరస్కరించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఇదే అంశం ఆధారంగా విద్యార్థి ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు. అధికారు క్యాంపస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వసతి గృహంపై పర్యవేక్షణ పెంచారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

జవాన్‌కు ఘన నివాళి



కిషోర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీస్ అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని పాయితారి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ లోపింటి కిషోర్ ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వహిస్తూ 2007 డిసెంబర్ 13న మావోయిస్టుల ఎదురు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారానికి 17 ఏళ్లు పూర్తి కావడంతో ఢిల్లీలోని సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన ఏఎస్‌ఐ ఎ.బి.రాజు పాయితారిలో జవాన్ స్వగృహానికి వెళ్లి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏడుగురు మావోయిస్టులను మట్టుబెట్టి వీర మరణం పొందిన కిషోర్ సాహసాలకు సీఆర్పీఎఫ్ సెల్యూట్ చేస్తుందన్నారు. అనంతరం రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్‌తో కలిసి కిషోర్ మాతృమూర్తి లక్ష్మీని దుశ్శాలువతో సత్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు లోపింటి పద్మనాభం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

అరసవల్లి: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను శనివారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించేలా జిల్లా కేంద్రంతో పాటు పలాస, టెక్కలి డివిజన్ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు, స్వయం సహాయక సంఘ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తున్నట్లు ప్రకటించారు. విద్యుత్ సిబ్బందితో పాటు వినియోగదారులు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారి గుడిలో చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుప్పిలిలో దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. 30 తులాల వెండి ఆభరణాలు దొంగలు పట్టుకుపోయారు. గుడి తాళాలు పగలుగొట్టి హుండీ సైతం పట్టుకుపోయారు. ఆలయ పూజారి బైరాగి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. లక్ష రూపాయల వరకు నష్టం జరిగి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వరి కుప్పలు దగ్ధం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కేమన్నయ్యపేటలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు 60 సెంట్ల విస్తీర్ణంలో నాలుగు వరి కుప్పలను దగ్ధం చేశారు. బాధితుడు రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి



డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ పుష్ప, ఉపాధి వేతనదారులు

ఇచ్ఛాపురం రూరల్: గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చామని, ఫీల్డ్ అసిస్టెంట్ అనపాన షర్మిళ అవకతవకలపై ఫిర్యాదుచేశామన్న అక్కసుతో తమకు రెండు వారాల నుంచి ఉపాధి పనులు కల్పించడం లేదంటూ మశాఖపురం గ్రామానికి చెందిన వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమకు పనులు కల్పించాలని కోరుతూ నలభై మంది ఉపాధి వేతనదారులు సంతకాలు చేసి శుక్రవారం జిల్లా కలెక్టర్, ఉపాధి పీడీ కార్యాలయాల్లో ఎంపీపీ బోర పుష్పతో కలిసి ఫిర్యాదు చేశారు. స్థానిక టీడీపీ ఉప సర్పంచ్ చెబితేనే ఉపాధి పనులు ఇస్తానంటూ ఫీల్డ్ అసిస్టెంట్ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని, తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : లావేరు మండలం పాతకుంకాంలోని ఎరువుల దుకాణంలో శుక్రవారం విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. ఏపీ విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది పాతకుంకాంతో పాటు విజయనగరం జిల్లా కర్ణం గ్రామంలో కూడా తనిఖీలు చేపట్టారు. రూ.9,59,098 విలువైన 70.545 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసులు నమోదు చేశారు. సరుకు వ్యత్యాసాలు, కాలం చెల్లిన పురుగు మందుల అమ్మకం వంటి అవకతవకలు గుర్తించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ఎరువుల అక్రమ వ్యాపారంపై నిఘా ఉంచామని, తనిఖీల్లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ పలాస అధ్యక్షుడు బోనెల గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పలాసలోని ఏపీఎన్జీవో హోమ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్ తక్షణమే నియమించాలని కోరారు. బకాయి జీపీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ, డీఏ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఏపీ ఎన్జీవోస్ హోమ్ పలాస కార్యాలయం నిర్మాణముకు నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరర్ ఎల్.రామారావు, కార్యదర్శి నీలాపు ఉపేంద్రరావు, సభ్యులు గిరి, దుర్గాప్రసాద్ పట్నాయక్, పాపారావు, శ్రీనివాసరావు, త్రివేణి పాల్గొన్నారు.

100 లీటర్ల సారా సీజ్



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో ఎక్సైజ్ అధికారులు

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సిబ్బంది దాడులు నిర్వహించి 100 లీటర్ల సారా సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ కె.బేబి తెలిపారు. కొరంజిబద్ర గ్రామంలో ఇద్దరి వద్ద నుంచి 90 లీటర్ల సారా, కంచిలి మండలంలో ఓ మహిళ నుంచి 8.4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ముగ్గురినీ రిమాండ్‌కు పంపించామని తెలిపారు. మందస మండలం కొండలోగాంలో 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.